


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### మళ్ళీ మళ్ళీ రాని రోజులు.

**హాయిగా చిన్నప్పుడు** ప్రయాణం అనగానే మరచెంబూ, హోల్డాలూ, ఇనపరేకు పెట్టె, ఒక బుట్టతో సిద్ధమయ్యేవాళ్ళం. అదేవిటో రైలు ఎక్కగానే ఆకలి మొదలయ్యేది. అప్పుడికీ పెద్దాళ్ళు నిమ్మతొనలూ (పిప్పరమెంట్లు), బిస్కట్ పేకట్లూ లిబరల్‌గా కొనేవాళ్ళు. అరటిపండ్లు మస్ట్‌గా కొనాలండోయ్. ఇక "కా...ఫీ" అన్న కేక రాగానే ప్రాణాలు లేచొచ్చి "ఇలా రా.. రెండు కాఫీ" అనగానే, వేడినీళ్ళూ, పాలూ మరుగుతున్నట్లుగా రెండుగ్లాసుల్లో పోసి నేస్‌కేఫ్ పొడీ, పంచదారా వేసి కదులుతున్న రైల్లో లాఘవంగా నురగలు కక్కేట్లు ఆరబోసి ఇచ్చే కాఫీ ఎంతైనా బావుండేది. అమ్మమ్మ ఇంటినుండి తెచ్చిన పూరీలూ, పులిహోరా, పెరుగన్నం ఎప్పుడు పెడ్తుందా అని ఎదురుచూసే వాళ్ళం.

తప్పనిసరిగా నాలుగు వారపత్రికలు కొనాల్సిందే మగాళ్ళు అయితే ఎదురు బొదురు సీట్ల మీద కూర్చుని చతుర్ముఖపారాయణాలు. అసలు చిన్నప్పటి నుండే నాకు రైలు ఎక్కగానే వేరుశెనక్కాయిలూ, బత్తాయిలూ వలిసి తొక్కలు పారేసేవాళ్ళన్నా, నీళ్ళ మరచెంబులు ఒంపేసి కంపార్టుమెంటు తడి చేసేసేవాళ్ళన్నా మా చెడ్డ చిరాకు. అవి చేతుల్తో శుభ్రం చేసే పిల్లలకి తప్పకుండా డబ్బులివ్వాలి.

పెద్దాళ్ళు కొనేవాళ్ళు కాదు కానీ, ఘుమఘుమ వాసనలతో బేసిన్లో తెచ్చి "మస్‌స్ సాల...' అని వడమాట మింగేసి అమ్మే ఉల్లిపాయ వడలు నోరూరించేవి. బక్కెట్లలో ఐస్ ముక్కల మధ్య "కూల్‌డ్రింక్స్" అంటూ ఆరెంజ్ కలర్ గోల్డ్‌స్పాట్ అసలు చూడగానే గుటకలొచ్చే కోకోకోలా, కలర్ సోడాలూ, ముక్కలు కోసి ఉప్పూ కారం అద్దిన కలెక్టర్ మావిడికాయలు, అబ్బో ఎన్నని? పిల్లలు కాళ్ళు బాదిన వాళ్ళు బాదినట్లు వుండేవారు. పెద్దవాళ్ళు కొన్నవ్వాళు కొన్నట్లుండేవారు.

ప్లాట్‌ఫార్మ్ మీద నిలబడి వీడ్కోలు చెప్పేవాళ్ళు, కాసేపు రైలుతో బాటుగా నడుస్తూ చేతులూపడం, కొత్తగా అత్తారింటికెళ్తున్న ఆడపిల్లలు కన్నీళ్ళు పెట్టుకోవడం.. బాపుగారి బుడుగులు 'నీ పెళ్లాన్ని నేను రచ్చిత్తాలే మొగుడూ, బెంగెట్టుకోకు' అని హామీలివ్వడం... కదిలే రైలు కిటికీలోంచి ఒక్కొటొక్కటిగా పరిగెడ్తూ మాయం అయే టెలిఫోన్ స్థంభాలు, నీళ్ళ మీద ఒంటికాలు జపం చేసే కొంగలూ, పట్టాల పక్కన కూర్చున్న వాళ్ళు సిగ్గుపడ్తూ గభాల్న లేచి నించోడాలూ, టైలర్ ఆకుపచ్చ బట్ట కత్తిరించి పరికిణీలు కుడ్తున్నట్లూ, ముక్కలుగా ఆకుపచ్చ పంటపొలాలూ.. కిటికీలోంచి కనిపించే ఆకాశం అన్నీ ఎంత అందంగా వుండేవి? ఎంత విచిత్రంగా వుండేవి?

రైల్లో ముష్టివాళ్ళు పాడే పాటలు గురించి చెప్పుకోవాలిసిందే అందులో 'నడిపించు నా నావ' లాంటి పాటలు సంగీతం నేర్చుకుని పాడేవాళ్ళు పాడినట్లు పాడేవారు. కొన్ని సినిమాల్లో పాటలు వాళ్ళకోసమే రాసారా అన్నట్లుండేవి.

కాయితాలతో 'విండ్‌మిల్స్' లాంటివి తయారుచేసి పుల్లకి గుచ్చి ఇస్తే ఆ చక్రాలు గిర్రున తిరుగుతూ ఎంత కాలక్షేపాలిచ్చేవీ? ఒక వూచకి కోతిబొమ్మలాగి వదిలేత్తే పైనుండి గిర్రున తిరుగుతూ జారేది. బుడగ వూది ఎనిమిది ఆకారంలో, మధ్యలో దారం కట్టి పై బుడగకి కళ్ళూ, అట్ట ముక్కూ మూతీ పెట్టి, తలకి చిన్న టోపీ పెట్టి, కిందో అట్టముక్క అంటించి అమ్మేవాళ్ళు. అది ఎంత పై నుండి వదిలినా కింద నిలబడి వూగేది కానీ అడ్డంగా పడేది కాదు. చిన్న చిన్న బెలూన్లలో నిండా నీళ్ళు పోసి వూది దారం కట్టి 'లాయిలప్పలు' అమ్మేవాళ్ళు. మగపిల్లలైతే రైలుబొమ్మా, కారుబొమ్మలూ, లేదా విమానం కంపల్సరీ. ఇంక ఆడపిల్లలకైతే లక్కపిడతలూ, చక్కగా రంగులు వేసిన చెక్క రోలూ, తిరగలీ, స్టౌ, గిన్నెలూ, తెడ్లూ... ఓ చందనం బొమ్మా, కొన్ని రబ్బరు  బొమ్మలూ వుండి తీరాల్సిందే

తాటాకులతో కూడా బొమ్మలు చేసి వాటికి బట్టలు కట్టి బొమ్మల పెళ్ళిళ్ళు చేసేవాళ్ళం.

ఇప్పుడసలు అంతంత చక్రాలు చక్రాలు తిప్పుకుంటూ గతంలోకి వెళ్ళిపోవాల్సిన అవసరం ఏవొచ్చిందమ్మా? అంటే పిల్లల్నీ, వాళ్ళని పెంచే తీరునీ, వాళ్ళ ఆటల్నీ, వాళ్ళ బొమ్మల్నీ, వాళ్ళు అడిగే ప్రశ్నల్నీ చూస్తుంటే ఆశ్చర్యమేస్తోందిస్మా!

మా అన్నయ్య మనవడు తొమ్మిదో నెలలో 'ఐపేడ్'లో కార్టూన్స్ చూడ్డం మొదలు పెట్టాడు. అసలు పిల్లలకి బస్సు ప్రయాణాలూ, రైలు ప్రయాణాలూ తెలీవు. డైరెక్ట్‌గా విమానాలే. అందులోనూ కదలగానే వీళ్ళకి 'ఐపేడ్'లో కార్టూన్స్ ఫిల్మ్ పెట్టి ఇచ్చెయ్యాలిట. ఇంక ఏడాది దాటినప్పటినుండీ వాడు ఆడే ఆటవస్తువులు 'సెల్‌ఫోన్‌లు'... అవును.. 'మా బుజ్జిగాడు ఎన్ని సెల్‌ఫోన్లు నీళ్ళల్లో ముంచి పాడుచేసాడో లెక్క లేదండీ' అని తల్లితండ్రులు మురిపెంగా చెప్తుంటారు.

మా చిన్నప్పుడు మూడు చక్రాల సైకిలు వుంటే గొప్ప. ఫోటో స్టూడియోల్లో కొయ్యగుర్రాలూ, హంసల వుయ్యాలా వుండేవి. అందుకే ఫోటో స్టూడియోకి వెళ్దాం అని నేను పేచీలు పెట్టేదాన్ని.

వెధవది జాతరలో కొన్న ఏ ప్లాస్టిక్ కారో, రబ్బరు బంతో విరిగిపోతేనే, అమ్మమ్మ వీపు మీద వడ్డించేది.

అలాంటిది 'ఐపేడ్'లూ, సెల్‌ఫోన్లూ, కార్టూన్లూ చూసి, అయిపోగానే, పసిపిల్లలు విసిరి కొడ్తున్నారు. డబ్బు విలువ తెలీదు. సౌకర్యాలూ, వసతులూ వాడుకోకూడదనీ, నేపీలకి, హగ్గీలకి గ్రటా ఖర్చుపెట్టద్దనీ కాదుకానీ.. అసలు పిల్లల్ని పెంచే పద్ధతి చూస్తే తెలుస్తోంది, మాది ఓల్డ్ జనరేషన్ అని.

వాడు 'కుయ్యి'మనకూడదు. కళ్ళనుండి నీటి బొట్టు రాలకూడదుట. మా పిల్లలకి మా శ్యామలమ్మ ఒళ్ళంతా నూనె రాసి, నలుగు పెట్టి, కాళ్ళమీద పడుకో పెట్టుకుని, అటూ ఇటూ కాళ్ళూ, చేతులూ గుంజి, వేడి వేడి నీళ్ళు పోస్తుంటే, గుక్కలు పెట్టి ఏడ్చినా దడిసేది కాదు. పైగా అమ్మమ్మ పిల్లలు నీళ్ళకీ, పాలకే పెరుగుతారమ్మా అనేది. అసలు ఒళ్ళంతా మర్దించి అలా వేడినీళ్ళు పోసి పడుకోపెడితే ఆ పిల్లలు సొమ్మసిల్లి గటటటా పాలుతాగి, సాంబ్రాణి పొగ వెయ్యగానే రెండు మూడు గంటలు పడుకునేవారు. తల్లికి వంటింటి పనులు చేసుకోడానికి బోలెడు వ్యవధి దొరికేది.

నేనైతే మా పెద్దాడు పుట్టాకే 'వెయ్యిపడగలు' నవల చదివాను. బాలింతకి పెద్దవాళ్ళు కమ్మగా పత్యం పెట్టేవాళ్ళు. గిన్నెడు వెన్న కాచిన నెయ్యితో, సొంటిపొడీ, వెల్లుల్లి కారం పొడీ, తెలకపిండి కూరా, చారూ, పాత చింతకాయపచ్చడీ ఆహా! ఆ భోగమే భోగం. భోంచెయ్యగానే తాంబూలం ఇచ్చేవాళ్ళు.

తల్లులకి అలా వుంటే పిల్లలకి వూహ తెలిసి మొహాలు గుర్తుపట్టడం మొదలుపెట్టగానే 'తారంగం.. తారంగం.. తాండవ కృష్ణా తారంగం' అనో 'చేతవెన్నముద్ద' అనో నేర్పిస్తూ 'దోబూచీ' రైలుబండి 'కూ.. చుక్ చుక్' అనీ, 'దాదం దక్కచ్చీ.. చిన్నన్నా పెదన్నా, అనీ 'కాళ్ళం గజ్జీ కంకాళమ్మా, వేగులచుక్కా వెలగా మొగ్గా, 'గుడు గుడు గుంచం గుండేరాగం' ఒప్పులకుప్పా.. ఒయ్యారిభామా' అనీ నేర్పిస్తూ అమ్మమ్మలూ తాతయ్యలూ ఆడిస్తుండేవారు.

మా అన్నయ్య మనవడు 'గురుబ్రహ్మ' 'గురు విష్ణు' అని వాళ్ళ అమ్మమ్మ నేర్పిస్తుంటే 'గురు రంభా...గురు విగ్గూ' అంటున్నాడట. వాళ్ళ తాత పేరు బ్రహ్మాజి అయితే రంభాజి అంటున్నాడట. "వీడి రంభ తపస్సుకి ఒక వేళ రంభ ప్రత్యక్షమవుతుందేమో?"

ఇంకా విచిత్రం ఏమిటంటే ఇప్పటివాళ్ళకి పిల్లలు ఇంజెక్షన్ ఇచ్చినా ఏడవకూడదూ నొప్పి పెట్టకూడదూట. అందుకే పెయిన్‌లెస్ ఇంజెక్షన్‌లు ఇప్పిస్తున్నారట. ఇంక వాడికి సున్నిపిండీ, నూనె, మహా అయితే ఆయిల్ క్లాతూ, పోతపాలు అయితే పాలడబ్బాలూ మా రోజుల్లో ఖర్చు. ఇప్పుడు అలాకాదు వాడికి వీళ్ళ జీతంలో సగం ఖర్చు పాలు, వైద్యం కాక బట్టలూ, బొమ్మలూ, కాస్త పెద్దవగానే వాడికి క్రికెట్టూ, మ్యూజిక్కూ, కరాటే, వీలైతే డాన్సూ అన్నీను.

స్కూళ్ళల్లో గోడలకి రబ్బర్ స్కర్టింగులుట. పడ్డే దెబ్బలు తగలకుండానూ.

మాకైతే పరిగెత్తి ఆటలు ఆడ్తూ పడీ, సైకిల్ తొక్కుతూ పడీ, మోకాళ్ళకి ఎప్పుడూ చిప్పలూడిపోయి రక్తంతో బాటు ఇసుక లోపల దూరి, పెద్దాళ్ళకి తెలిస్తే దెబ్బలు తగిలించుకున్నందుకు ఇంకో రెండు దెబ్బలేస్తారని కిక్కురుమనకుండా వచ్చేవాళ్ళం.

మా అన్నయ్య వడుగులో నేను పందిరి పాతిన మేకు (షామియానా వాళ్ళు కట్టడానికి భూమిలో పాతుతారు) మీద పడి, మోకాలి చిప్ప చితికిపోయి రక్తం కాలవ కట్టింది. మా అమ్మ అది చూసి కళ్ళు తిరిగిపడిపోయింది. అమ్మమ్మ ఇంత పసుపు మెత్తితే, పరికిణీ కిందకేసుకుని, నేను 'నాలుగు స్థంభాలాట' ఆడుకోడానికి వెళ్ళిపోయాను.

నా పిల్లల చిన్నతనంలో కూడా మా కాలనీలో చాలా ఓపెన్ ప్లాట్లు వుండేవి. హాయిగా పరుగులెత్తి ఆడి, పడీ బోలెడుసార్లు దెబ్బలతో వచ్చేవాళ్ళు. మోకాళ్ళు క్లీన్‌గా వుంటే మా ఆయన పిల్లల్ని 'ఇంకా సైకిల్ నేర్చుకోలేదా? మోకాళ్ళు మచ్చలు లేకుండా వున్నాయి' అని తిట్టేవారు.

ఇప్పుడు పిల్లలకి స్కూలునుండొచ్చి, పలహారం చేసి పరిగెత్తుకుంటూ గ్రౌండ్‌లో కెళ్ళి ఆడుకోడాలు లేవు. కళ్ళు చేతుల్లోకి వచ్చేటట్లు, టీ.వీలూ, లాప్‌టాపులూ, సెల్‌ఫోన్లూనూ.

'అయ్యో. వాడు పోకీమేన్ చూడనిదే అన్నం తినడు' అని చెప్పుకోవడం గొప్ప. అసలు పచ్చని చెట్ల మధ్య ఆటలు లేకపోతే పిల్లలకి వ్యాయామం ఎలా? 'డి' విటమిన్ ఎక్కడనుండొస్తుంది?

ఇంక ఈ హైబ్రిడ్ తిండ్లు తింటున్న హైబ్రిడ్ పిల్లలు మాట్లాడే మాటలు పెద్దవాళ్ళు బుర్ర తడుముకునేలా వున్నాయి.

మా అక్క మనవడు ఫస్ట్‌క్లాస్ చదువుతున్నాడని బొమ్మల రామాయణం కొనిస్తే , 'గ్రాండ్ మా ద కంటెంట్ ఈజ్ గుడ్. బట్ ద లాంగ్వేజ్ ఈజ్ నాట్ అప్ టు ద మార్క్. ఈవెన్ బాల్‌గోపాల్ ఫెల్ట్ దసేమ్' అన్నాడు. బాలగోపాల్ అంటే స్వయానా వాళ్ళమ్మకి నాన్న. వీడికి తాతగారూనూ.

ఇంకో తంగణా వచ్చాడు. మా పెద్దాళ్ళ మధ్యన ఎందుకని.. "పైన అశ్విన్ మామ వున్నాడు.. వెళ్ళి మాట్లాడు. " అని మా అబ్బాయి దగ్గరికి మేడమీదకి పంపాను.

వాడు ముద్దుగా "ఏం ఆటలాడ్తున్నావురా? ఈ మధ్య?"

"నేనేం ఆడను. హాయిగా 'పోగో' చూస్తాను" అన్నాడుట. అన్నాడుట.

"అలా టీ.వి చూస్తుంటే ఏం థ్రిల్‌గా వుంటుంది? ఏదైనా కొత్త గేమ్స్ ఆడాలి" అన్నాడుట మా అబ్బాయి.

దానికి వాడు "ఈ మధ్య నాకు దొగతనం చేయడం థ్రిల్‌గా వుంది మామా" అన్నాడుట.

వీడు ఆశ్చర్యపోయి "ఎక్కడ దొంగతనం చేస్తున్నావు?" అంటే

"మా అమ్మ పర్సులోంచి డబ్బులు దొంగిలించి స్కూల్ దగ్గర సమోసాలు కొనుక్కుంటున్నాను" అన్నాడట.

వీడు వాడ్ని సంస్కరించదలచి "అవి కొనుక్కోకూడదు మంచివి కావు" అన్నాడుట.

"అయితే వాడెందుకు అమ్ముతాడూ?" అన్నాడుట.

"వాడు డబ్బులుకోసం అమ్ముతాడు. మనం తింటే జబ్బులొస్తాయి"

"మిగతా పిల్లలకి రాని జబ్బులు నాకెందుకొస్తాయి?"

"అసలు ఇంట్లో దొంగతనం చెయ్యడం చాలా తప్పు"

"మరి పక్కింట్లో చేస్తే అమ్మ కొడ్తుందిగా?"

"అసలు ఎక్కడా దొంగతనం చెయ్యకూడదు."

"అమ్మ అడిగితే ఇవ్వదుగా"

"అయినా దొంగతనం తప్పు"

"అమ్మ ఆఫీస్‌కి వెళ్ళి డబ్బులు సంపాదించేది నా కోసమే. అవి వాడుకోవడం నా హక్కు." అన్నాడుట.

మా అబ్బాయికి ఆ ఐదేళ్ళ బడుద్దాయి మాటలు విన్నాకా, పిల్లల్ని కనడం, పెంచడం లాంటి టాస్కులు ఆలోచించి చాలా ధైర్యం వుంటే కానీ చెయ్యకూడదు అనిపించిందిట.

ఇలా వున్నాయి ఇప్పటి హైటెక్ పిల్లల తెలివితేటలు.

ఇంకా బొడ్డు వూడని పిల్లలు 'మమ్మీ వైఫై కనెక్ట్ చెయ్యి. యూ ట్యూబ్ చూడాలి' అంటుంటే వాళ్ళ నాలెడ్జి చూసి ఇంక వీళ్ళకి స్కూలు అనవసరమేమో అనిపిస్తోంది. స్కూలుకి వెళ్ళేలోపల అన్నీ వచ్చేస్తున్నాయి.

మరచెంబులు పోయి ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ వచ్చి అవీ పోయి టప్పర్ వేర్‌లు వచ్చాయి. దాంతో ఇంటి ఇల్లాళ్ళ కొచ్చింది తంటా బోలెడు ఖరీదులు పెట్టి 'ఎమెజాన్'లో తెప్పిస్తే ఈ పిల్ల వెధవలు నిమిషంలో ఎక్కడో వదిలి పెట్టొచ్చేస్తారు. అమెరికాలో ఎమ్.ఎస్ చేసి వుద్యోగం చేస్తున్న ఆర్కిటెక్ట్ కొడుకుని నేను "వాటర్ బాటిల్ ఎక్కడ వదిలేసి వచ్చావు?" అంటే వాడు బోలెడు చిరాకు పడి "మమ్మీ నిఖిల్ కార్లో వదిలేసా తెస్తాలే' అంటాడు. కానీ రోజూ గుర్తు చేసినా సంవత్సరం గడిచినా తేడు. రోజూ ఇంటికొచ్చేవాడి ఫ్రెండ్ నిఖిల్‌ని నేను అడిగితే ఇంక ప్రిస్టేజీ అంతా గంగపాలై పోయినట్టు వీడు గొడవ చేస్తాడు. అలా తిట్టే నేను ఈ మధ్య ఆ పాడు పని నేనే చేసి వచ్చా. ఓ పెద్ద ప్రొడ్యూసర్ ఆఫీస్‌లో నా టప్పర్ వేర్ బాటిల్ మర్చిపోయి, బయట కొచ్చి కారెక్కాక గుర్తొచ్చి ఫోన్ చేసి అడిగాను. అప్పుటికే ఆఫీసరూం ప్యూన్ తాళం పెట్టేసాడుట. "వెధవ బాటిల్ వదిలేస్తే ఏమైందీ?" అన్నాడాయన. అది మూడొందల అరవై రూపాయిలు అమెజాన్‌లో తెప్పించాను అని ఆ మల్టీమిలియనీర్‌కి చెప్పలేక నోర్మూసుకుని ఇంటికొచ్చానా.. మా అమ్మ "బాటిల్ ఏదీ? పారేసొచ్చావా? పిల్లల్ని అయితే కోప్పడ్తావు" అని గుమ్మంలోనే నాలుగూ కడిగేసింది. ఎంతైనా అమ్మ ఎవరికైనా అమ్మేకదా.

ఆ ప్రొడ్యూసర్ మాత్రం బాటిల్ అడిగానని నామీద అలిగి "It looks weired" అని నాకు మెసేజ్‌లు పెట్టారు. ఏం చెప్పుకోను? మా తోడికోడలు 'హెపటైటిస్ బి'కి వేక్సిన్ ఇండియాలో జనరేట్ చేసిన సైంటిస్ట్. మా ఇంటికొచ్చిన స్టీలు టిఫిన్ బాక్స్ వాళ్ళింటికి తిరిగి వెళ్ళకపోతే ఆవిడకి బీ.పీ పెరిగిపోయి డ్రైవర్ని ఇంతదూరం కారిచ్చి పంపిస్తుంది. అంత భ్రాంతి వుంటుంది ఆడవాళ్ళకి తమ వస్తువుల మీద.

మొన్న వరలక్ష్మీ వ్రతం ముందు రోజు మా పెద్దమ్మ కలలో కొచ్చింది. కలశం పెట్టుకోడానికి పెద్ద చెంబు బాగా కుదుర్తుంది అని మా పెద్దమ్మగారు బతికుండగా వరలక్ష్మీ వ్రతానికి కలశం పెట్టడానికి ఇత్తడి మరచెంబు తెచ్చుకున్నాను. మళ్ళీ వెనక్కి ఇవ్వలేదు. ఆవిడ ఒకటి రెండుసార్లు అడిగినా 'ఇస్తాలే పెద్దమ్మా' అన్నాగానీ ఇవ్వలేదు.

ఆడవాళ్ళకి తమ వస్తువుల మీద మోహం అలాగే వుంటుంది. ఇదెందుకో ఏ సైంటిస్టూ కనిపెట్టలేదు మరి.

మేం పాత తరం వాళ్ళం అని పిల్లలు అంటారంటే అంటారు మరి, నిద్రొస్తోందని గుర్తుగా సూర్యాకాంతం నోటి ముందు చిటికెలు వేసుకోవడం, కొడుకుకి పెళ్ళి వయసొచ్చినా పెళ్ళి చేసుకోవడం లేదని శాంతకుమారీ, అంజలీ దేవీ షాల్ కప్పుకుని బాధ పడడం, హీరోయిన్, హీరో మీద ప్రేమ ప్రకటించడానికి నిద్రపోతుంటే వెళ్ళి దుప్పటి కప్పడం, పనివాళ్ళు చచ్చిపోయిన యజమానుల ఫోటోల ముందు నిలబడి "చూసారా.. బాబుగారూ?" అంటూ భుజాలు కదిలేట్టు ఏడవడం చూస్తూ పెరిగాం మరి.

ఇలా మాటలు రాని వయసులోనే గ్రావిటీలూ, బాహుబలులూ చూస్తూ అరచేతిలో సెల్ పెట్టుకుని పెరగలేదుగా. ఆరువందలకి ఓ కుటుంబానికి సరుకులు వచ్చేవి. ఇప్పుడు ఒక మినీ పిజ్జా వస్తోంది మరి.

ఎందుకో ఇవాళ చిన్నప్పటి రైలు ప్రయాణాలూ, ఆటలూ మీదకి ధ్యాస పోయింది. రోజులు మారి పోయాయి. చిన్నప్పుడు స్వరాజ్ హోటల్ మేడమీదున్న మా బంధువుల ఇంటికి మెట్లెక్కి వెళ్తుంటే, హోటల్ కిచెన్‌లో చాపల మీద తరుగుతున్న కూరలూ, ఘుమఘుమలాడ్తూ మరుగుతున్న సాంబార్లూ కనిపించేవి. స్వాగత్, అన్నపూర్ణా, సిద్ధార్థాలాంటి హోటల్స్‌లో హైదరాబాదులో అరిటాకు వేసి, ఆవకాయా, గోంగూర పచ్చడీ, కొరివికారం, కందిపొడితో రకరకాల కూరలూ, సాంబారూ, రసం, పెరుగుతో భోజనం పెట్టేవాళ్ళు. ఈ మధ్య 'యూ ట్యూబ్'లో అరిటాకు భోజనం చూసి గూగుల్ చేస్తే అలా పెట్టే ఒక్క హోటల్ దొరకలేదు హైదరాబాద్‌లో.

అసలు చిన్నప్పుడు చేత్తో ఇడ్లీ తుంపుకుని సాంబార్లో వేసి తింటే, ఆ చేతి సువాసన కడిగినా ఎంతసేపో వుండేది. ఇప్పుడు సాంబారు అనబడే ఎర్రని ఘాటైన ద్రవం సంగతి ఎంత పెద్ద హోటల్‌లో అయినా ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది.

'నీ చేతి వంట ముందు ఆ హోటల్ కూడు ఏం పనికొస్తుందోయ్?' అని మా వారు అంటే ఇదివరకు శలవు రోజునా వంట తప్పదా అని అలిగేదాన్ని. ఈ మధ్య నిజమేగా వూటలో ఆవకాయకీ, కందిపొడికీ జై అని ఇంట్లోనే వుంటున్నాం.

ఏమో.. ఈ ఫాస్ట్ ఫుడ్స్, క్రీ పాయింట్ల వల్ల పిల్లలు చిన్నప్పుడే ముదిరిపోతున్నారా? అని డౌట్ అనుమానాలొస్తున్నాయి సుమీ.

COMMENTS

